## యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద..

యూపీలో చెల్లని అజారుద్దీన్..జూబ్లీహిల్స్‌లో చెల్లుతాడా? అసలు జూబ్లీహిల్స్‌లో ఏం తెలుసు? ఏ కాలనీ, బస్తీ తెలుసా? ఎన్నికల తెల్లారితే అజారుద్దీన్ ఇక్కడ ఉండడు..కానీ మాగంటి గోపీనాథ్ ఏ గల్లీకి రమ్మన్నా క్షణాల్లో వస్తాడు..సమస్యను పరిష్కరిస్తాడు? అలాంటి నాయకుడినే మళ్లీ ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద..ఏర్పాటు చేసిన రోడ్ షోకు ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. ఎన్నడూ లేనంతగా హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉందని.. ఈ ప్రశాంతత కొనసాగాలన్నా? పెట్టుబడులు రావాలన్నా? విశ్వనగరం కావాలన్నా బలమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వమైన బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. కరంట్, తాగునీరు, ప్రజా రవాణాను మెరుగుపర్చుకున్నామని చెప్పారు. వచ్చే టర్మ్‌లో 24 గంటల తాగునీరు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపర్చుకుందామని అన్నారు. 400 కిలోమీటర్ల మేర అదనంగా మెట్రోను విస్తరించుకుందామని పేర్కొన్నారు. సిలిండర్ ధరను రూ. 400లకే అందిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా కల్పిస్తాం..అమ్మలా అన్నపెడుతున్న హైదరాబాద్‌ను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

అభివృద్ధి ఆగిపోతుంది

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మత కల్లోలాలే..

**జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్**

- ఆ పార్టీకి ఓటేస్తే కరెంటు కోతలు, ఛార్జీలు తప్పవు..
- 400 కిలోమీటర్ల మేర అదనంగా మెట్రోను విస్తరించుకుందాం
- అజారుద్దీన్ నాన్‌లోకల్.. మాగంటి లోకల్..
- మాగంటి పిలిస్తే వస్తాడు..సమస్య పరిష్కరిస్తాడు
- అజారుద్దీన్ ఎన్నికలు కాగానే కనబడడు..

సిటీబ్యూరో, బంజారాహిల్స్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ): జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని శ్రీరాంనగర్‌లో మాగంటి గోపీనాథ్ ఏర్పాటు చేసిన రోడ్‌షోకు మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో మాగంటి గోపీనాథ్ పట్టున్న నాయకుడు, ప్రజా సేవకుడని.. కరోనా సమయంలోనూ గొప్పగా పనిచేశాడన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమంలో ముందుండే నాయకుడు మాగంటి అని చెప్పారు. బ్యాలెట్‌లో నాలుగు నంబర్ వచ్చిన కారు గుర్తుపై ఓటు వేసి మాగంటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇక్కడ బీజేపీకి డిపాజిట్ కూడా రాదని..కాంగ్రెస్ అభ్యర్థి గొప్ప క్రికెటర్ కావొచ్చు..కానీ ప్రజా నాయకుడు కాదన్నారు. అసలు అజారుద్దీన్ ఎప్పుడైనా జూబ్లీహిల్స్, శ్రీరాంనగర్, ఎర్రగడ్డ, బోరబండలో కనబడ్డాడా? ఎన్నికలు రాగానే అజారుద్దీన్ కనబడుతున్నడు..నాన్‌లోకల్ అయిన ఆయన మురాదాబాద్‌ను వదిలి ఎన్నికల కోసమే ఇక్కడకు వచ్చారని తెలిపారు. ఈ ప్రాంతానికి అజారుద్దీన్ వస్తే ఆయనతో క్రికెట్ ఆడండి..కానీ ఓటు మాత్రం మాగంటి గోపీనాథ్‌కే వేయాలన్నారు. తొమ్మిదిన్నరేండ్లు అన్నదమ్ముల్లా కలిసి ఉన్నామని, ప్రశాంత వాతావరణంలో ఉన్న హైదరాబాద్‌ను మళ్లీ కాపాడుకుందామని.. కాంగ్రెస్ వస్తే మళ్లీ మతకల్లోలాలు తప్ప అభివృద్ధి ఉండదన్నారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే చీకటి రోజులు కరెంట్ కోతలు, ఛార్జీల మోతలు తప్పవని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో కరెంట్, మంచినీటి సౌలత్ మెరుగుపర్చుకున్నామని, వచ్చే టర్మ్‌లో నిరంతర నీటి సరఫరాతో పాటు రహదారులు, డ్రైనేజీలు మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్

## హైదరాబాద్ సన్నీడియోల్‌కు నచ్చింది.. కానీ ఇక్కడి దరిద్రులకు నచ్చుతలే..

- ఖైరతాబాద్ జహీరానగర్ రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

సిటీబ్యూరో, బంజారాహిల్స్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ) : విశ్వనగరం తరహాలో అభివృద్ధి చెందిన హైదరాబాద్.. బాలీవుడ్ నటుడు, ఎంపీ సన్నీడియోల్‌కు నచ్చుతుంది గానీ.. ఇక్కడ ఉన్న దరిద్రులకు నచ్చలేదని మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జహీరానగర్ రోడ్‌షోకు ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్‌తో కలిసి మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలను ఓట్లు వేసే యంత్రాలుగానే చూశారని, కేసీఆర్ హయాంలో రూ.1250 కోట్లతో మైనార్టీల సంక్షేమానికి కృషి చేశారన్నారు. 50 ఏళ్లుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ మైనార్టీలకు చేసిందేమి లేదని, దేశంలోని ఏ రాష్ట్ర సీఎం కూడా ఈ తరహాలో అభివృద్ధి చేయలేదన్నారు. 200కు పైగా మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. 2014లో ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15లక్షలు వేస్తానన్న మోదీ... ఆ మాటనే మరిచిపోయాడరన్నారు. విద్వేషపూరిత మాటలతో రెచ్చగొట్టే రాజాసింగ్‌పై సీఎం కేసీఆర్ పీడీ యాక్టుతో కోరలు పీకేశారన్నారు. షాదీ ముబారక్, పండుగ పూట తోఫాలను ఇచ్చి కేసీఆర్ ఆప్తుడిలా నిలిచారని కొనియాడారు. జహీరానగర్, నంది నగర్‌లోనే నా ఓటు ఉందని, ఇక్కడకు నిత్యం వచ్చి పోతుంటానని ఇక్కడి సాధకబాధలపై అవగాహన ఉందన్నారు. ఢిల్లీ నుంచి వచ్చే నేతలకు భయపడేది లేదని, మోదీ రానీ, బోడీ రాని ఎవరొచ్చినా భయపడేది లేదన్నారు.మోదీ వచ్చి కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ బీ టీం అంటాడు. రాహుల్ వచ్చి బీజేపీకి బీఆర్ఎస్ బీ టీం అంటూ గాలి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్లలో ఏ ఒక్క రోజు కూడా అల్లర్లు, మత కల్లోలాలు లేవన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ మంచినీళ్లు వస్తున్నాయని, రానున్న రోజుల్లో 24గంటల పాటు మంచినీటిని సరఫరా చేయడమే తమ లక్ష్యమన్నారు.

## గుంపులుగా వస్తున్న నేతలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలే..


రోడ్ షోలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్

సింహం లాంటి సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు గుంపులు గుంపులుగా ఎక్కడెక్కడి నుంచో దిగుతున్న నేతలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ బడా గణేశ్ చౌరస్తాలో ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్ షోకు మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. మంచి పని చేసిన కేసీఆర్‌ను కడుపులో పెట్టుకుని గెలిపించాలన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎక్కడో నుంచి రావాలి, పేపర్ మీద రాసింది చదవాలి.. ఢిల్లీ తిరిగి వెళ్లిపోవడమే రాహుల్ గాంధీ చేస్తున్న పని అని మంత్రి విమర్శించారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. అందరికీ అన్నం పెట్టే హైదరాబాద్ మంచిగుంటేనే తెలంగాణ మంచిగుంటదన్నారు. దానం నాగేందర్‌కు వేసే ప్రతి ఒక్క ఓటు కేసీఆర్‌ను మరోసారి సీఎం చేస్తుందన్నారు. నవంబర్ 30న కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మరోసారి గెలిపించాలన్నారు.

గులాబీ జెండాతో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్

